ప్రజాశక్తి
గురువారం 29 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి

డిఎఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పన్ను పక్కదారి



- వసూలు చేసిందెంత... జేబుల్లోకి చేరిందెంత..!
- పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ఆరోపణలు

పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు సంబంధించి వసూలు చేసిందెంత... నేరగా జేబుల్లోకెళ్లింది ఎంత అన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా పంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూళ్లలో ఈ వ్యవహారం జోరుగా నడిచిందన్న ఆరోపణలున్నాయి. అనంతపురం జిల్లాలో 577 పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో మొత్తం ఏడాది ఆస్తి పన్ను డిమాండ్ రూ.16 కోట్లకుపైగా ఉంది. ఇందులో ఏడాదికి సగటున యాభై శాతం వరకు పన్నులు అధికారికంగా వసూలు అవుతుండగా తక్కినవి బకాయిలుగా ఉంటున్నాయి. ఇందులోనూ చాలా వరకు వసూలై నేతల జేబుల్లోకి వెళ్లినట్టు ఆరోపణలున్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను, ఇతర పన్నుల డిమాండ్ కలిపి మొత్తం రూ.16.1 కోటికాగా, అంతకు మునుపు బకాయి రూ.5.3 కోట్లు మొత్తం కలిపి 21.4 కోట్లు పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది. ఆ ఏడాది మొత్తం కలిపి వసూలైంది కేవలం రూ.11 కోట్లు మాత్రమే. అందులో పాత బకాయి రూ2.25 కోట్లు, ఆర్థిక సంవత్సరం వసూలైంది రూ.8.78 కోట్లు మొత్తం రూ.11 కోట్లు వసూలయ్యాయి. తక్కినవి రూ.10.4 కోట్లు బకాయిలుగా ఉండిపోయాయి. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో బకాయి రూ.10.9 కోట్లుకాగా, రూ.16.7 కోట్లు కలిపి మొత్తం రూ.27.6 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా జులై ఆఖరు వరకు రూ.2.13 కోట్లు వసలయ్యాయి. తక్కినవి పెండింగులోనున్నాయి. ఇంకా రూ.17.1 కోట్లు వసూలవ్వాల్సి ఉంది. ఇందులో బకాయిగా వసూలవని దానిలో అత్యధికం వసూలై కొద్ది మంది నేతల జేబుల్లోకి చేరిందన్న ఆరోపణలున్నాయి.

కొంత సొమ్ము బ్యాంకు ఖాతాల్లోనే

ఆస్తి పన్నుగా వసూలైన డబ్బులను ప్రత్యేకంగా హెచ్‌డిఎఫ్‌సి ఖాతాల్లో జమ చేయాలని గతంలో ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఆ రకంగా డబ్బులు ఆయా ఖాతాల్లో జమ చేశారు. దాని తరువాత ప్రభుత్వ ఖాతాకు మార్చాల్సి ఉంటుంది. అది చేయకుండా ఆ ఖాతాల్లో డబ్బులు ఉండిపోయినట్టు సమాచారం. ఈ రకంగా రావాల్సిన డబ్బులను సొంత జేబుల్లోకి మార్చి కొంత, మరికొంత బ్యాంకు ఖాతాల్లో

నిరర్థకంగా ఉండపోయినట్టు సమాచారం. ఒకవైపు గ్రామాల్లో అభివృద్ధి కుంటుబడింది. కనీసం మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిచే అవకాశం లేకుండా ఉంది. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న సమయంలో వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన పారిశుధ్య పనులు కూడా చేపట్టిన దాఖలాల్లేవు. ఇలాంటి సమయంలో వసూలైన పన్నులు కూడా పక్కదారి పడుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతన్నాయి.

భూ నిర్వాసితులను విస్మరించడం దుర్మార్గం

- స్పందించకుంటే సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్
- పదిరోజుల్లో పరిష్కరిస్తామని డిఆర్ఒ హామీ
- అధికారుల హామీతో నిర్వాసితుల ఆందోళన విరమణ

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

సాగుభూములను నాసన్, బెల్ పరిశ్రమల కోసం ఇచ్చిన భూ నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం, ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకపోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ విమర్శించారు. భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బుధవారం రెండవ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేష్, మహిళా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు దిల్షాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేసి ఆదర్శంగా ఉండాల్సిన జిల్లా స్థాయి అధికారులు నిర్వాసితులకు పునరావాసం ఇవ్వకపోవడం సరికాదన్నారు. మూడు సంవత్సరాల నుంచి అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పాలకులు మాటలు చెప్పడం కాకుండా ఆచరణలో నిర్వాసితులకు పునరావసం ఇచ్చేలా శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక మంత్రికి నియోజకవర్గంలో అన్ని సమస్యలూ కనిపిస్తున్నా నిర్వాసితుల సమస్యలు కనిపించకపోవడం విచారకరం అన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సిపిఎం అండగా ఉండి పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సిపిఎం నాయకుల ఆధ్వర్యంలో నిర్వాసితులు డిఎఒ గిరికి వినతిపత్రం అందించారు. ఈ సమస్యను ఫోన్ ద్వారా డిఆర్ఒ భాగ్యరేఖ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన డిఆర్ఒ పది రోజుల్లో నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అధికారి హామీ మేరకు ఆందోళన కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమించారు. పది రోజుల్లోపు సమస్య పరిష్కారం కాకపోతే నిర్వాసితులతో కలిసి పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, సిపిఎం నాయకులు రామాంజనేయులు, భూ నిర్వాసితులు వెంకట లక్ష్మమ్మ, అచ్చమ్మ, వెంకటరామిరెడ్డి, వెంకట్రాముడు, గంగమ్మ, నరసమ్మ, కదిరప్ప, మారుతి పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ జగదీష్

దులీప్ ట్రోఫీ నిర్వహణకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్డీటీ అనంత క్రీడా మైదానంలో జరగనున్న "దులీప్ ట్రోఫీ" నిర్వహణ కోసం చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పి.జగదీష్ బుధవారం పరిశీలించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ చర్చించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ టోర్నీలో ఎలాంటి భద్రతాపరమైన లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్పీతో పాటు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు, రాప్తాడు సిఐ శ్రీహర్ష, దులీప్ ట్రోఫీ కార్యనిర్వాహక కార్యదర్శి షాబుద్దీన్, ఆర్డీటీ డైరెక్టర్ సాయికృష్ణ, ఎసిఎ వెన్యూ మేనేజర్ ఆదిత్య వర్మ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మధు ఆచారి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా రాజ్యలక్ష్మి నియమితులయ్యారు. దాదాపు ఒకటిన్నర ఏళ్ల పాటు సంబంధిత న్యాయమూర్తి పోస్ట్ భర్తీ కాకపోవడంతో అటు న్యాయవాదులు ఇటు కక్షిదారులు ఇబ్బందులకు గురయ్యారు. విషయాన్ని పలుమార్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్నత న్యాయాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఉన్నత న్యాయస్థానం న్యాయాధికారుల బదిలీల్లో భాగంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో ఇటీవల జరిగిన జేసీజీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన లలిత లక్ష్మిని నియమించారు. ఈ మేరకు ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది ఇలా ఉండగా ప్రస్తుతం రాజ్యలక్ష్మి అమరావతి న్యాయ శిక్షణ అకాడమీలో శిక్షణలో ఉన్నారు. త్వరలోనే ఆమె ఇక్కడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్మశానవాటిక కోసం 15 ఏళ్లుగా పోరాటం

శవయాత్రలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలకేంద్రంలో శ్మశానవాటిక ఏర్పాటు కోసం 15 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని అయినా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని సిపిఎం, అనుబంధ సంఘాల నాయకులు విమర్శించారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలన్న డిమాండ్‌తో సిపిఎం, సిఐటియు, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం గడ్డిబొమ్మతో శవయాత్ర చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు నరసింహులు, మండల కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ముదిగుబ్బ గ్రామ పరిధిలో సుమారు 30 వేల మంది జనాభా ఉందన్నారు. ఇంత జనాభా ఉన్న గ్రామానికి శ్మశానవాటిక లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించకపోతే నిరవధిక ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, బాబు, ఆవాజ్ కమిటీ బాబ్జాన్, రఫీ, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనలో నాయకులు, గ్రామస్తులు

అర్ధనగ్నంగా ఉరివేసుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

'ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారవా'..?

7వ రోజు నిరసనలో 'సత్యసాయి' కార్మికులు

ప్రజాశక్తి - నల్లమాడ

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా తమ తలరాతలు మారవా అని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో మండల పరిధిలోని కొత్తపల్లి తండా పంప్‌హౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 7 వ రోజుకు చేరుకుంది. కార్మికులు అర్ధనగ్నంగా ఉరివేసుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికుడు శంకర మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నుంచి కూడా తమకు వేతనాలు సరిగా రాలేదన్నారు. ధర్నాలు చేసి రోడ్డు ఎక్కితే తప్ప వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయినా తమ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ఆరునెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమ్మెకు దిగి ఏడు రోజులైనా పాలకులు తమను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంపు హౌస్ కార్మికులు వెంకటేష్, నాగభూషణ, శ్రీనివాసులు, రామ్మోహన్, షామీర్, కేశవ, శంకర, రామ్మోహన్ రెడ్డి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తచెరువు : సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. కొత్త చెరువులోని పుట్టపర్తి రహదారిలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న సత్యసాయి వాటర్ ట్యాంక్ వద్ద ఏడు రోజులుగా నిరసన కొనసాగిస్తున్న కార్మికులకు సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా ఈ పథకంలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. తక్షణమే వారికి వేతనాలు చెల్లించాలని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలకు తాగునీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు తక్షణమే ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ముత్యాలు, సిఐటియు నాయకులు బాళ్ల అంజి, శంకర్ రెడ్డి, వాటర్ సప్లై ఉద్యోగులు దాదాపీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో నిధుల పక్కదారిపై విచారణకు డిమాండ్

పిహెచ్‌సి ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్నం పిహెచ్‌సిలో నిధులు పక్కదారి పట్టాయని వాటిఆ గురించి విచారణ చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బృందం బుధవారం పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ నిమిత్తం వస్తుండడంతో మంగళవారం ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ ప్రమీల ఆశా వర్కర్లతో పెయింటింగ్, పారిశుధ్య పనులు చేయించారు. ఈ ఘటనలపై ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన సిఐటియు అనుబంధ ఆశావర్కర్ల సంఘం నాయకులు బుధవారం నాకాస్ బృందానికి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే కేంద్ర అధికారుల బృంద సభ్యులు సిఐటియు నాయకులు నుండి వినతి పత్రం స్వీకరించడానికి నిరాకరించడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో నాయకులు బుధవారం పట్నం పిహెచ్‌సి ముందు ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిఏటా ఇస్తున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయని విమర్శించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠినమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలతో సంబంధం లేని పనులు చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కదిరి రూరల్ పట్నం పిహెచ్‌సికి వచ్చిన కేంద్ర బృందానికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ మాట్లాడుతూ జిల్లాలో ఆసుపత్రుల అభివృద్ధి కమిటీలకు వస్తున్న నిధులు దుర్వినియోగం అవుతున్నాయని విమర్శించారు. ఆశాలతో పనులు చేయించి బిల్లులు పెట్టుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలకు ఇలాంటి అవినీతి బాగోతాల వల్ల తూట్లు పడుతున్నాయని అన్నారు. నిధుల దుర్వినియోగం విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ జగన్మోహన్, కో కన్వీనర్ ముస్తాక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పట్నం పిహెచ్‌సి ఎదుట నాయకుల ఆందోళన

విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి - కదిరి టౌన్

విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు బుధవారం సిపిఎం కదిరి కార్యాలయంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం చారిత్రాత్మకమని అన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ ఉద్యమం రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలిచిందన్నారు. ప్రభుత్వాలు మారిన సంస్కరణలు మాత్రం అమలవుతున్నాయని విమర్శించారు. విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ విధానాలు పెరిగిపోయాయని విమర్శించారు. విద్యుత్ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రపంచ బ్యాంకు విధానాలకు, ప్రైవేటీకరణ విధానాలకు, వ్యతిరేకంగా పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, ముస్తాక్, సాంబశివ, రామ్మోహన్, నారాయణ, నాగరాజు, బాబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ఉద్యమ అమరవీరులకు నివాళి

పరిశ్రమల్లో ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కలెక్టర్ టిఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో పరిశ్రమల నిర్వహణ, ప్రమాదాల నియంత్రణపై అనుబంధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఫ్యాక్టరీస్ అధికారి కేశవులు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో పూర్తి భద్రత చర్యలు చేపట్టడంతో పాటు మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమల్లో చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు. పరిశ్రమలు, కార్మిక, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రమాదాలను నియంత్రించాలని సూచించారు. ఇటీవల రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో జిల్లాలో పరిశ్రమల భద్రత పటిష్టం చేసి ప్రమాదాలను నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పరిశ్రమలో సేఫ్టీ అధికారిని నియమించి, వారికి అగ్నిమాపక అధికారులు తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు అగ్నిమాపక అధికారి ఎన్‌ఒసి పొందాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆసుపత్రి, పోలీస్ తదితర అత్యవసర సేవలు అందించేందుకు వారి ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎస్పి రత్న మాట్లాడుతూ పరిశ్రమల్లో విపత్తు జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై అవగాన కలిగి ఉండాలన్నారు. పరిశ్రమల చుట్టూ గట్టి భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి హేమచంద్ర రెడ్డి, కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం వేడుకలు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలో హజ్రత్ సయ్యద్ బెహెలూల్ షా ఖాద్రీ 827వ గంధం ఉత్సవం బుధవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి ఆదోని షేక్షావలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి స్వామి వారికి గంధం సమర్పించారు. విచ్చేసిన భక్తులకు దర్గా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, పెనుకొండ ఎజిపిఎం భాస్కర్ రెడ్డి, జెడ్పీ జిల్లా కో ఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, సోమందేపల్లి మాజీ ఉప సర్పంచి కుళ్ళాయప్ప తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

మరమగ్గాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

ప్రజాశక్తి- సోమందేపల్లి

మండల కేంద్రంలోని మరమగ్గాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 11 రకాల చేనేత వస్త్రాలు మరమగ్గాలపై తయారు చేయకూడదన్న నిబంధనలకు విరుద్ధంగా మరమగ్గాలపై చేనేత చీరలు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, రీజినల్ ఆఫీసర్ మనోహర్, టెక్నికల్ సూపరింటెండెంట్ షణ్ముఖం, అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, డెవలప్మెంట్ ఆఫీసర్ భాస్కర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సోమందేపల్లిలోని పలు మగ్గాలను తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా చీరలు తయారు చేస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. మరమగాలపై చట్ట వ్యతిరేకంగా చేనేత వస్త్రాలు తయారు చేయిస్తే సంబంధిత వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా మగ్గాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చీరలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి www.prajasakti.com

జెసిబితో ముళ్ల కంపలు తొలగిస్తున్న దృశ్యం

ముళ్లకంపలు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను అధికారులు తొలగించారు. 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ముళ్ల కంపలు పెరిగి ప్రమాదకరంగా మారిన పరిస్థితులపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రమాదమని తెలిసిన పట్టించుకోరా అన్న శీర్షికతో సమస్యను మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. బుధవారం జెసిబిని ఏర్పాటు చేసి ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను తొలగించారు. ఆ ప్రాంతంలో ఉన్న గుంతలలో మురుగు నీరు చేరడంతో మట్టిని వేసి శుభ్రం చేశారు. సమస్యను వెలుగులోకి తీసుకుని వచ్చి పరిష్కరించిన ప్రజాశక్తికి ఆ ప్రాంత వైద్యాధికారి నవీన్ కుమార్, వైద్యులు జక్కా నరేంద్ర కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు ఎపి సిపిఎస్ఇఎ పెనుకొండ డివిజన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం రాత్రి మంత్రిని కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన మంత్రి ఉపాధ్యాయుల సమస్యలను సిఎం, చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ఈఏ వ్యవస్థాపక అధ్యక్షులు పాలెల రామాంజనేయులు యాదవ్, జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకర్, అధ్యక్షులు నాగవర్దన్ రెడ్డి, రాష్ట కార్యదర్శి మల్లికార్జున, నాయకులు రంగేష్ కుమార్,సజ్జరాయప్ప, చంద్ర, గణేష్, ఇర్ఫాన్, ఉలవల నాగరాజు, వినోద్ నాయక్, శ్రీనివాసులు, రామకృష్ణ, నరసింహమూర్తి, శీనా నాయక్, కాలయ్య, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్ రెడ్డి, అభిరామ్, రవీంద్ర, రమేష్, శ్రీధర్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో కొడికొండ చెక్ పోస్ట్ లోని సమర్ధనం వికలాంగుల సంస్థ ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సమర్ధనం వికలాంగుల సంస్థ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ జాబ్ మేళాల్లో 20 ప్రముఖ కంపెనీలు పాల్గొని యువత కోసం ఉద్యోగావకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ జాబ్ మేళాలో 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన 10, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులు పాల్గొనవచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు 6364867797, 6364867798 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి - నంబులపూలు కుంట

మండలకేంద్రంలోని ఇందిరా కాలనీలో ఉండే ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ గోపాల్‌నాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండేటట్టు చూడాలని ఉపాధ్యాయుల సమయ పాలన పాలనా పాటించాలని ఆదేశించారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని తుంగోడు గ్రామంలో ఉచిత పశువైద్యశిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్, మండల పశువైద్యాధికారి బాలాజీ నాయక్, గోపాలమిత్రలు వెంకట్రాంరెడ్డి, రామకృష్ణారెడ్డి, సచివాలయ పశు వైద్య సిబ్బంది అనిత, భారతి, ఆశ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గుడిబండ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్ఐవి ఎయిడ్స్ నివారణపై ఐటీసీ కౌన్సిలర్ నరసింహులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జిల్లా అప్ సాక్స్, ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిబి యూనిట్ మురళీ, ఒఆర్‌డబ్ల్యూ నరసమ్మ, చంద్రప్ప, రామదాసు, పుట్టమ్మ, మమత, సవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి - అమరాపురం

అమరాపురంలోని దక్షిణగొల్ల హట్టిలో వేణుగోపాలస్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రథోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి రఘువీర రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షులు బికె. లింగన్న, వెలుగు దేవరాజ్, పీసీ చిక్కన్న, నరసింహమూర్తి, బీసీ దేవరాజు, గౌడనకుంట మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : కలెక్టర్

మట్టి విగ్రహాల ఏర్పాటుపై రూపొందించిన గోడ పత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మట్టివిగ్రహాల వాడకంపై రూపొందించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. వినాయక చవితి పండుగను సుస్థిరంగా పర్యావరణానికి అనుకూలంగా జరుపుకోవాలని, చెరువులు జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గించాలని కోరారు.. వినాయక మండపాలకు అనుమతులు జారీ చేసేటప్పుడు విగ్రహాల ఏర్పాటు సమయంలో కూడా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ పోలీసు డిపార్ట్ మెంట్ లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన సవరించిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పి వి. రత్న, ఎపిపిసిబి ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పివి. కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బిఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు : రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 ఏళ్లు అయిన సందర్భంగా ఆన్ లైన్ లో క్విజ్ పోటీలు నిర్వహిస్తోందని అందులో ఆసక్తి గల డిగ్రీ విద్యార్థులు పాల్గొనవచ్చని కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆర్‌బిఐ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 లోపు ఆన్ లైన్ లో విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ క్విజ్ పోటీలు దేశవ్యాప్తంగా జరుగుతాయన్నారు. ఒక కళాశాలలో ఎంతమంది విద్యార్థులు అయినా ఈ పోటీలలో పాల్గొనవచ్చని అన్నారు. విద్యార్థులు ఒక టీం గా ఏర్పడి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి 2 లక్షల రూపాయలు, ద్వితీయ బహుమతి రూ.1.50 లక్షలు, తృతీయ బహుమతి లక్ష రూపాయలు ఇవ్వబడుతుందన్నారు. అలాగే జోనల్ స్థాయిలో జాతీయ స్థాయిలో బహుమతులు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి రుసుం చెల్లించవలసిన అవసరం లేదని ఉచితంగానే ఆన్ లైన్ లో రిజిస్టర్ చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ

న్యాయవాదులు కేసుల పరిష్కారానికి సహకరించాలి

జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ కోరారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా లలిత లక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షతన అదనపు జూనియర్ సివిల్ జడ్జి పరిచయ కార్యక్రమాన్ని జిల్లా జడ్జితో పాటు సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ నిర్వహించారు. ఇందులో భాగంగా అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ నూతన జడ్జిని పరిచయం చేశారు. ఇదివరకటి తరహాలోనే ప్రస్తుత న్యాయమూర్తి కూడా న్యాయవాదులందరూ సహకరించి కేసుల పరిష్కారానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు ఇందాద్, నగేష్, ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగభూషణరావు, రంగారెడ్డి, నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవో 84ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జీవో 84ను రద్దు చేయాలని రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల సంఘం పిలుపు మేరకు హిందూపురం మున్సిపల్ ఉపాధ్యాయులు బుధవారం భోజన విరామ సమయంలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ విద్యా వ్యవస్థకు ప్రమాదంగా మారిన 84 జీవోను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో టీచర్ల కొరత, అప్ గ్రేడ్ కాబడిన పాఠశాలలకు పోస్టులు మంజూరు, పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన విద్యాశాఖ అధికారులు మున్సిపల్ పాఠశాలల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతోందన్నారు. పురపాలక చట్టాలకనుగుణంగా ఏర్పడిన సర్వీసులను ఆధారంగా చేసుకుని పాఠశాలలకు పోస్టులు మంజూరు, బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ విద్యా వ్యవస్థ అభివద్ధికి పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యాయ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాసులు, ఎంటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు టి. వెంకటరెడ్డి, ఎం.రవి సిద్ధార్థ, చంద్రానాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడుసార్లు అవార్డు తీసుకోవడం అభినందనీయం

షబ్బీర్‌ను సన్మానిస్తున్న పట్టు రీలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ప్రజాశక్తి విలేఖరి షబ్బీర్ రాష్ట్రస్థాయిలో మూడుసార్లు బొమ్మ రెడ్డి స్మారక అవార్డులు తీసుకోవడం అభినందనీయమని పట్టు రీలర్ల అసోసియేషన్ నాయకులు ముస్తఫా అన్నారు. బుధవారం స్థానిక పట్టుగుళ్ల మార్కెట్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో షబ్బీర్‌ను, నూతనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా ఎంపికైన రామాంజనేయులను ఘనంగా సన్మానించి, మెమెంటోను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ఆ సమస్యలను పరిష్కరించే సత్తా పాత్రికేయులకే ఉందన్నారు. 2008వ సంవత్సరంలో పట్టు రీలర్లకు, రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలని ఆందోళన చేస్తే ఆ సమస్యను ప్రత్యేక కథనల రూపంలో వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం పట్టు రైతులు, రీలర్ల సమస్యలను అర్థం చేసుకుని ప్రోత్సాహకాన్ని అందించడానికి ముందుకు వచ్చిందని చెప్పారు. అప్పటి నుంచి పట్టును విక్రయించిన రైతుకు, కొనుగోలు చేసిన రీలర్ కు ఇన్సెంటివ్ రూపంలో ప్రభుత్వం ఆదుకుందన్నారు. అయితే 2019 తర్వాత ప్రభుత్వం ఇస్తున్న ఇన్సెంటివ్ పూర్తిస్థాయిలో అందలేదన్నారు. దీంతో పట్టు రైతులు, రీలర్లు ఆందోళన కార్యక్రమాలను చేపడితే పాత్రికేయులు సంపూర్ణ సహకారాన్ని అందించి సమస్యను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. ఇలా ప్రతి సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి, ఆ సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఖాజా, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, ఉపాధ్యక్షులు బాషా, సహాయ కార్యదర్శి దాదాపీర్, క్యాషియర్లు ఖలీల్, రహీమ్ బేగ్, సలావుద్దీన్, ఆదినారాయణ, అల్లాబకాష్, తో పాటు రీలర్లు, పాత్రికేయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వికసిత్ భారత్ 2047 లో భాగంగా వికసిత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వచ్చే ఐదు సంవత్సరాలకు ప్రణాళికలు రూపొందించాలని పుట్టపర్తి మండల నోడల్ ఆఫీసర్, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహమూర్తి కోరారు. బుధవారం పుట్టపర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పుట్టపర్తి మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళికలపై చర్చించారు. మండలంలోని గ్రామాలలో ఆయా శాఖలకు సంబంధించిన జరిగిన పనులు, జరగబోయే ఐదు సంవత్సరాలకు అభివృద్ధికి సంబంధించిన పనుల ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఈవోఆర్డీ అశోక్ కుమార్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా నోడల్ అధికారి అబ్దుల్‌ఖయూం, ఎంపిడిఒ రామానాయక్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 19 శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047లో భాగంగా వచ్చే ఐదు సంవత్సరాలకు సంబందించి మండల అభివృద్ధికి సంబందిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కృష్ణానాయక్, ఏవో లక్ష్మి ప్రియ, ఎపిఎం సూర్యనారాయణ, వైద్యాధికారి మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ 2047లో భాగంగా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడానికి మండల అధికారులకు మంగళవారం జిల్లా పరిశ్రమల అధికారి సయ్యద్ భాష ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రాబోవు ఐదు సంవత్సరాలకు సంబందించి మండల పరిధిలో చేయబోయే అభవృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఎంఇఒ గోపాల్ నాయక్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే మరమ్మతుల నిమిత్తం నాలుగురోజుల క్రితం కాలువ తీయించిన అధికారులు దానిని అలాగే వదిలేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిందే. మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో రొద్దం వైయస్సార్ సర్కిల్‌లో మరమ్మతుల కోసం రోడ్డుకు పక్కనే దాదాపు నాలుగడుగుల లోతు కాలువ తీసి దాదాపు నాలుగు రోజులకు కావస్తోంది. నిత్యం రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో ఇంతపెద్ద లోతు గుంత తీయించిన అధికారలుఉ అక్కడ ప్రమాదసూచికను ఏర్పాటు చేయకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మలుపు ఉండడంతో వేగంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉందని రాత్రి వేళలో దారి తెలియని చూడని వ్యక్తులు వాహనం వస్తే ప్రమాదం బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన తీసిన గుంత

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని రొద్దం-3 సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకే సిబ్బంది లేక కార్యాలయం ఖాళీగా దర్శనమిచ్చింది. విఆర్ఎ ఒక్కరే కార్యాలయానికి కాపలాగా ఉన్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుతిరిగారు. అసలే పనులు కాలం కావడంతో ఉదయం పనులకు వెళ్లిన ప్రజలు మధ్యాహ్నం ఇంటికి వచ్చి సాయంత్రం 5వరకు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటారని కార్యాలయానికి వస్తే అక్కడ ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. సచివాలయ సిబ్బంది లేనివిషయంపై డిడిఒ, లోచర్ల సచివాలయం పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి జగదీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ గోవర్ధన్ సెలవులో ఉన్నారని చెప్పారు. విఆర్ఒ శ్రీదేవి తహశీల్దార్ కార్యాలయానికి, సర్వేయర్ సురేష్ కార్యాలయానికి వెళ్లారని చెప్పారు. వెటర్నరీ అసిస్టెంట్ పశువైద్యశాలకు, హార్టికల్చర్ అసిస్టెంట్ నాగభూషణం ఫీల్డ్‌కు వెళ్లారని చెప్పారు.

సచివాలయానికి కాపలాగా ఉన్న విఆర్ఎ

మానసిక వికలాంగులపై దాడి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండల పరిధిలోని వీరాపురం పంచాయతీ వెంకటాపురం ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి మానసిక వికలాంగులైన నారాయణ స్వామి, మద్దిలేటిపై వరుసకు బాబాయ్ అయిన ఆదినారాయణప్ప కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఇంటి విషయంపై మద్యం మత్తులో దాడికి పాల్పడినట్టుగా తెలుస్తోంది. కర్రతో విచక్షణ రహితంగా కొట్టడంతో తీవ్రంగా రక్త గాయాలు కాగా వారిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు గ్రామస్తులతో వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మునీర్ అహ్మద్ హెచ్చరించారు.

పాముకాటుతో రెండు గేదెలు మృతి

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం బిజీ హళ్ళి గ్రామానికి చెందిన యంజారప్ప అను రైతుకు చెందిన రెండు గేదెలు పాముకాటుతో మృతిచెందాయి. దీంతో తనకు ఒకటిన్నర లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయాన్ని స్థానిక పశు వైద్య అధికారులకు తెలపగా ఏడి అమరానాథ్ సమక్షంలో శవ పరీక్ష నిర్వహించి గేదెలు పాముకాటుతో మృతి చెందినట్లు నిర్ధారించారని బాధిత రైతు తెలిపాడు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి బాధిత రైతుతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి టిడిపి స్థానిక నాయకులు దాసిరెడ్డి, గురుమూర్తి, బాలకృష్ణ, ఈర్న, రవికుమార్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలు గొడవలు, అల్లర్లు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని డిఎస్‌పి మహేష్ సూచించారు. జిల్లా ఎస్‌పి సూచనల మేరకు బుధవారం పట్టణంలోని త్యాగరాజనగర్ కాలనీలలో హిందూపురం డిఎస్‌పి మహేష్ పర్యవేక్షణలో సిఐలు, పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తులకు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం అక్రమ విక్రయం, గంజాయి అమ్మే నివాసాలను, అనుమానస్పద ఇళ్లను సోదా చేశారు. వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు తనిఖీలు చేసి ఎటువంటి రికార్డులేని 4 ద్విచక్ర వాహనాలను, 1 ఆటోను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజగోపాల్ నాయుడు, కరీం, జనార్ధన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ సిఐగా రాఘవన్

ప్రజాశక్తి-పెనుకొండ

బాధ్యతలు స్వీకరిస్తున్న సిఐ

పెనుకొండ సిఐగా రాఘవన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సిఐ యుగంధర్ బదిలీపై వెళ్లారు. అనంతపురం ఎస్‌బి సిఐగా పనిచేస్తున్న రాఘవ బదిలీపై ఇక్కడికి వచ్చారు. పెనుకొండ సర్కిల్ పరిధిలోని పరిగి, సోమందేపల్లి, రొద్దం, పెనుకొండ ఎస్ఐలు సిఐని కలిసి అభినందించారు. అదేవిధంగా పెనుకొండ తెలుగుదేశం పార్టీ నాయకులు సిఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నారాయణస్వామి, పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, సూర్యనారాయణ, మైనార్టీ నాయకులు దాదు, హనుమంతు యాదవ్, రమణమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంలోనీ ఆయుష్ వైద్యశాలలో యోగా శిక్షకులుగా పనిచేయుట కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ఆయుష్ ఆసుపత్రిలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ యోగా శిక్షకులుగా దరఖాస్తు చేసుకునేవారు పీజీ, డిప్లమా, ఇన్ యోగాలో అనుభవం ఉండాలన్నారు. అసక్తి, అర్హత కలిగిన వారు ఈనెల 30వ తేదీ 11 గంటల లోపు హనుమాన్ కూడలిలో గల ఆయుష్ ఆసుపత్రి వద్ద దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఆసక్తి కలిగిన వారు 9440304547 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఫ్రీ హోల్డ్ భూముల జాబితా సిద్ధం చేయండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను రెవెన్యూ అధికారులు త్వరితగతిన సిద్ధం చేయాలని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించి ఫ్రీ హోల్డ్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు గత ప్రభుత్వంలో అసైన్మెంట్ భూములను రిజిస్టర్ భూములుగా మార్చబడ్డాయని వాటి వివరాలను సర్వే నంబర్ల వారిగా జాబితా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వాతి, ఆర్ఐ దుర్గేష్, వీఆర్వోలు వేణుగోపాల్, శ్రీనివాసులు, కాటమయ్య, నారాయణప్ప, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

సరిహద్దున ఉన్న కర్నాటక మేళ్య, కుడుములకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం హిందూపురం వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వ్యాధులు, వాటి ప్రమాదాలు గురించి వివరించారు. శారీరక ఆరోగ్యం పట్ల ఏ విధంగా శ్రద్ధ వహిస్తామో అదే తరహాలో మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్ శిరీష, మౌనిక, రమాదేవి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కళాశాలల కార్యవర్గాల ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌డిజిఎస్, బాలాజి డిగ్రీ కళాశాలల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు విద్యార్థులు చదువుకుంటు విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్ సిఐగా శ్యామ్ రావు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ రూరల్ సర్కిల్ సిఐగా శ్యామ్ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పుట్టపర్తి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సహకారం అందిస్తే గంజాయిని నిర్మూలిస్తాం

ప్రజాశక్తి - హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

మండల వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పార్టీలకు అతీతంగా పోలీసు శాఖకు సహకారం అందిస్తే పేకాట, మట్కా తో పాటు మత్తు పదార్థాలైన గంజాయిని సైతం సమూలంగ నిర్మూలిస్తామని అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీ గైర్హాజరు కావడంతో వైస్ ఎంపిపి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ తో పాటు జెడ్ పి టి సి నాగభూషణ, ఎంపీడీవో నరేంద్ర కుమార్‌తో మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో సిఐ ఆంజనేయులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పేకాట, మట్కా, గంజాయి సమూలంగా నిర్మూలన చేయడానికి ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకారం అవసరమని అన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల పరిధిలోని పథకాల అమలుపై వివరించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.